రామేశ్వరంబండలో భారీగా చెత్త కాల్చివేత

- ప్రజారోగ్యంతో చెలగాటం
- పర్యావరణంకు తూట్లు పొడుస్తున్న గ్రామపంచాయతీ
- తడిపొడి పేరున సేకరించి తగలబెడుతున్న సిబ్బంది
- తూతూ మంత్రంగా డంప్‌యార్డుల నిర్వహణ

రామేశ్వరంబండ పంచాయతీ పరిధిలో తగులబెడుతున్న చెత్త

పటాన్‌చెరు, జనవరి 29 : రామేశ్వరంబండ పంచాయతీలో పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వాహనాల్లో తిరిగి తడి,పొడి చెత్తను సేకరిస్తారు. సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి రీసైక్లింగ్ చేయాలి. కానీ చెత్త సేకరణ కార్మికులు చెత్తను పంచాయతీ పరిధిలోని భారీ జేసీబీ గుంతల వద్ద తగులబెడుతున్నారు. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గతంలో అన్ని రంగాల్లో ముందున్న పంచాయతీ ఏడాది కాలంగా చెత్తతో కంపుకొడుతున్నది. ఈ పంచాయతీ పరిధిలో వీకర్‌సెక్షన్ కాలనీ ఉంటుంది. దాదాపు ఐదు వేల జనాభా ఈ గ్రామంలో నివసిస్తారు. ప్రతి రోజు పంచాయతీ చెత్త సేకరణ సిబ్బంది ఇంటి ముందుకు వచ్చి చెత్తను సేకరించి జేసీబీ గుంతల్లో పారవేస్తున్నారు. జేసీబీ గుంతపై నున్న ఖాళీజాగలో వేస్తున్నారు. భారీగా చెత్త పోగైన తర్వాత పంచాయతీ సిబ్బంది వెళ్లి ఆ చెత్తకు నిప్పు పెడుతున్నారు. తడి,పొడి చెత్తతో పాటు ప్లాస్టిక్ బాటిల్స్, క్యారీబ్యాగులు, పాత టైర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు తగులబెడుతున్నారు. కుక్కలు, పందికొక్కులు వ్యర్థాల్లో తచ్చాడుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. డంపింగ్‌యార్డులో రోడ్డుపక్కనే ఉన్న దానిని నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో పోగవుతున్న టన్నులకొద్ది చెత్తను తగులబెడుతున్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

రామేశ్వరం బండలో వీకర్ సెక్షన్ కాలనీ వెనుకనే భారీగా జేసీబీ గుంతలు తవ్వారు. ఈ గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉంటుంది. గతంలో ఈ నీరు పరిశభ్రంగా ఉండటంతో ఇక్కడ చేపలు కూడా భారీగా పెరిగేవి. కొంతకాలంగా ఈ గుంతలకు మరోవైపు చెత్తను డంప్ చేస్తున్నారు. ట్రాలీల్లో, ట్రాక్టర్లలో తెచ్చిన చెత్తను ఇక్కడ పారవేస్తున్నారు. పంచాయితీ సిబ్బంది గుట్టల్లా ఏర్పడిన చెత్తను కాల్చిపారేస్తున్నారు. రకరకాల వ్యర్థాల పొగలు వీకర్‌సెక్షన్ కాలనీవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్లాస్టిక్, రబ్బర్, మందులు కాల్చిన నల్లటిపొగలతో ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదం ఏర్పడుతున్నది. పొగవుతున్న చెత్త నీటిని కాలుష్యం చేస్తున్నది. రామేశ్వరంబండ గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది చెత్తను తగులబెట్టి ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడటం మానుకోవాలని వీకర్‌సెక్షన్ కాలనీవాసుల కోరుతున్నారు.

జర్నలిస్టు యూనియన్ డైరీ ఆవిష్కరణ

డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 29 : సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా రంగం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నదని పేర్కొన్నారు. ప్రజా స్వామ్యానికి మూల స్తంభం మీడియా అన్నారు. ప్రజలకు, పాలకులకు వారధిగా ఉంటూ సమాజానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించడం గొప్ప విషయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సాయినాథ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సలహాదారు సునీల్, గౌరవ అధ్యక్షుడు శంకర్ రావు, ఉపాధ్యక్షుడు వీరేందర్ గౌడ్, రాజ్ కిశోర్, నాయకులు నాగభూషణం, పుండరీకం, లక్ష్మణ్, నర్సింహులు, బక్కప్ప, సంగమేశ్వర్, రాజేశ్ పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి భూపాల్

జహీరాబాద్, జనవరి 29 : నాణ్యమైన విద్యను బోధిస్తూ సరైన ప్రోత్సాహం అందిస్తే ఏ విద్యార్థి అయినా మెరుగైన ఫలితాన్ని సాధించగలుగుతారని, ఆ దిశగా ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేయాలని న్యాల్‌కల్ మండల తహసీల్దార్, పాఠశాల ప్రత్యేకాధికారి భూపాల్ అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న తీరు, ఉత్తమ ఫలితాల సాధన కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. పదిలో వందశాతం ఫలితాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి మారు తీరాథోడ్, హెచ్ఎం అమృత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతకు జేఎన్టీయూలో బైక్ ర్యాలీ

జేఎన్టీయూలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఒప్పంద అధ్యాపకులు

చౌటకూర్, జనవరి 29 : మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ క్యాంపస్‌లో బైక్ ర్యాలీ చేపట్టారు. ఉద్యోగ భద్రత లేకుండా ఏండ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ, సరైన వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రతతో కూడిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హత గల అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్ షిప్ ఇవ్వాలనని, మహిళా అధ్యాపకులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. ఒప్పంద కార్మికుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జె. సాయిచంద్ర, ఇతర విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

జీడిగడ్డ తండాలో పాతపంటల జాతరలో ఎడ్ల బండ్లకు స్వాగతం పలుకుతున్న డీడీఎస్ మహిళలు

జహీరాబాద్, జనవరి 29 : పాత పంటలైన చిరుధాన్యాలతో ఆరోగ్యం చేకూరుతుందని జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ డీడీఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య వెలుగురి సూచించారు. బుధవారం మొగుడంపల్లి మండలంలోని జీడిగడ్డతండాలో 25వ పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాత పంటలైన తైదలు, కొర్రలు, సామలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటల్లో అనేక పోషక పదార్థాలు అధికంగా ఉంటాయని, వాటిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం తండాలో డీడీఎస్ మహిళ సంఘాల సభ్యులు, మహిళల ఆటపాటలు, కోలాటం, చిటికెల రామాయణం మధ్య పాతపంటల విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్లతో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే పంటల యాజమాన్య శాస్త్రవేత్త డాక్టర్ రమేశ్, డీడీఎస్ సూపర్ వైజర్ నర్సమ్మ, జాతర కో- ఆర్డినేటర్లు వినయ్ కుమార్, మంజల, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మంజీరలో మాఘ అమావాస్య పుణ్య స్నానాలు

మంజీర నదిలో పుణ్య స్నానాలు చేస్తున్న ప్రజలు

చౌటకూర్, జనవరి 29 : మాఘ అమావాస్యను పుస్కరించుకుని ప్రజలు బుధవారం మంజీర నదిలో పుణ్య స్నానాలు చేశారు. మాఘ మాసంలో వచ్చే అమావాస్య రోజున నదిలో స్నానాలు ఆచరిస్తే పాపాలు తొలగుతాయన్నది భక్తుల విశ్వాసం. మండలంలోని ప్రజలు సమీపంలోని మంజీర నదికి వెళ్లి పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. శివంపేట, వెండికోలు, చక్రియాల, లింగంపల్లి, వెంకటకిష్టాపూర్, కోర్పోలు, సరాఫ్‌పల్లి, చౌటకూర్ తదితర గ్రామాల ప్రజలు మంజీర నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు.

సేల్‌డీడ్ పోయినది/హెచ్చరిక ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, తిరుమలపురి కాలనీ, కొల్లూర్ గ్రామం, రామచంద్రాపురం మండలం, సంగారెడ్డి జిల్లా వద్ద గల సర్వే నెం. 199లో 553.33 చ.గజాల విస్తీర్ణంగల ప్లాట్ నెం. 1కు సంబంధించి శ్రీ కె.లక్ష్మణచారి, తండ్రి: కె.రామాచారి, నివాసం: ముసారాంబాగ్, హైదరాబాద్ వారికి సంబంధించిన సబ్-రిజిస్ట్రార్, సంగారెడ్డి (పటాన్‌చెరు వద్ద తాత్కాలిక సబ్-రిజిస్ట్రార్) కార్యాలయంలో రిజిస్టర్ అయిన క్రయ దస్తావేజు నెం. 1809/1988, తేది: 23-03-1988 పోయినది, కనిపించుట లేదు. ఎంత వెతికిననూ దొరకలేదు. సదరు క్రయ దస్తావేజు ఎవరికైనా దొరికినచో దానిని దిగువ సంతకందారుకు తిరిగి అప్పగించగలరు. సదరు కె.లక్ష్మణ్‌చారి ఇంతకుముందే సదరు ప్లాట్‌ను బదిలీ చేశారు మరియు నా క్లయింట్ రిజిస్టర్డ్ క్రయ దస్తావేజు ద్వారా సదరు ప్లాట్‌ను కొనుగోలు చేశారు.

ఏవరేని వ్యక్తితో సదరు క్రయ దస్తావేజును ఆధారం చేసుకొని సదరు ప్లాట్‌కు సంబంధించి ఏదైనా లావాదేవీ లేదా ఒప్పందం కుదుర్చుకోరాదని సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది మరియు హెచ్చరిక చేయడమైనది. సదరు ప్లాట్‌కు సంబంధించి ఏదేని లావాదేవీ లేదా ఒప్పందం కుదుర్చుకున్నచో అది చట్టవిరుద్ధం మరియు చెల్లదు మరియు నా క్లయింట్ తగిన చట్టపరమైన చర్య తీసుకుంటారు మరియు ఆ తరువాత పరిణామాలకు నా క్లయింట్ బాధ్యత వహించరు.

సం/- (V.మనోహర్ రావు), అడ్వకేట్

ప్లాట్ నెం. 399, రోడ్ నెం. 81, ఫేజ్-3, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033. ఫోన్: 9849016333.

గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన

మాట్లాడుతున్న ఎంపీడీవో రామలింగం

చౌటకూర్, జనవరి 29 : మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో భోజనం బాగాలేదంటూ విద్యార్థులు రెండు, మూడు రోజులుగా ఆందోళన చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ మంగళవారం రాత్రి, ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగం బుధవారం వేర్వేరుగా వసతి గృహాన్ని సందర్శించారు. భోజన విషయమై అధికారులను అడుగగా, అన్నం తరచుగా మెత్తగా ఉడికించి వడ్డిస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అన్నం మెత్తగా ఉడుకబెడుతున్నారంటూ పలుమార్లు చెప్పినప్పటికీ, ఏ మాత్రం మార్పు రాలేదని విద్యార్థులు తెలిపారు. ఉప్పు నీటితో వంటలు వండుతుండటంతో అన్నం మెత్తగా కావడంతో పాటు కూరలు రుచిగా ఉండటం లేదని వంట మనుషులు అధికారులకు తెలియజేశారు. వసతి గృహానికి మంజీర నల్లా కనెక్షన్ ఉన్నప్పటికీ, నీటి సరఫరా జరుగడం లేదని, 24 గంటల పాటు మంజీర జలాలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వెండికోలులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ తప్పని సరిగా అనుసరించాలని సూచించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

తహసీల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జిన్నారం గ్రామస్తులు

జిన్నారం (బొల్లారం) జనవరి 29 : కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని జిన్నారం గ్రామస్తులు తహసీల్ ఎదుట బుధవారం నిరసనకు దిగారు. ఈ మేరకు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన అంతిరెడ్డి గారి రమాదేవికి చెందిన భూమి సర్వే నెంబర్ 58లో ఉందని, కానీ రోడ్డును దాటుకొని సర్వే నంబర్1లో ప్రస్తుతం తాంబేలు గుట్టపై నిర్మిస్తున్న శివాలయం వరకు రావడం అక్రమమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవో, స్థానిక తహసీల్‌లో ఫిర్యాదులు చేసినా స్పందన లేదని వాపోయారు. సమస్యను జటిలం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నిరసనలో గ్రామస్తులు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మున్ని నర్సింహులు, రాజేందర్ రెడ్డి, సుధాకర్, శంకరయ్య, ప్రభాకర్, నీలం రాము, ఫణి గుప్తా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలి

జహీరాబాద్ ఎంపీడీవో మహేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న మండల ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది

జహీరాబాద్, జనవరి 29 : ఉపాధి హామీ పథకం కింద పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఉపాధి హామీ పథకం జహీరాబాద్ నియోజకవర్గం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లోని మండల అభివృద్ధి అధికారులకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయా మండల అధికారులు, సిబ్బంది కలిసి వినతి పత్రాలను అందజేశారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకుని మూడు నెలల బకాయి వేతనాలను చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు.

'పది' గణిత ప్రశ్నల దీపిక ఆవిష్కరణ

గణితశాస్త్ర ప్రశ్నల దీపికను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు

గుమ్మడిదల, జనవరి 29 : విద్యార్థులు గణితశాస్త్రం అంటే భయంతో ఆసక్తి చూపకపోవడంతో గణితశాస్త్రంలో విద్యార్థులు వెనుకడుగు వేస్తున్నారనే ఉద్దేశ్యంతో గణితశాస్త్ర ఉపాధ్యాయుడు పదో తరగతి విద్యార్థులకు సులభంగా అర్థమవడానికి గణితశాస్త్ర ప్రశ్నల దీపికను రూపొందించారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న ఏవీఎస్ఎన్ ప్రసాద్ గణితశాస్త్ర ప్రశ్నల దీపికను రూపొందించారు. జిల్లాలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, సీఎంవో వెంకటేశం,ఏసీజీఈ పండరీ నాయక్, ఏడీ శంకర్, సూపరింటెండెంట్ సురేఖ ఆవిష్కరించారు. వీరితో పాటు మండల విద్యాశాఖ అధికారులు వెంకట్ నర్సింహులు, భీమ్‌సింగ్, వెంకటస్వామి, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, తెలంగాణ గణిత ఫోరం అధ్యక్షుడు సిద్ధేశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, పుణ్యానాయక్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని 17వార్డు, హాస్టల్ గడ్డ ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న దృశ్యం. ప్లేట్లు కడుగుతూ, తాగునీటికోసం బోరు నీరు పట్టుకుంటున్న విద్యార్థులు

సంగారెడ్డిలోని ఇరుగు పల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉండవలసి ఉండగా, ఒక క్లాస్‌రూమ్‌లో నలుగురు.. మరో తరగతిలో ఐదు మంది విద్యార్థులే ఉన్నారు.
-సంగారెడ్డి ఫొటో గ్రాఫర్, జనవరి 29

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలో గోదామును పరిశీలిస్తున్న ఆర్వో నర్సింహులు

జిన్నారం(బొల్లారం) జనవరి 29 : బొల్లారం పారిశ్రామిక వాడలోని ప్రభుత్వ భూములు కాపాడాలి అనే శీర్షికన ఈనెల 25న 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. బుధవారం కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు ఆర్వో నర్సింహులు సిబ్బందితో కలిసి పారిశ్రామికవాడలోని సర్వే నెంబర్ 175 లో కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. ఈ వ్యవహారంలో ఓ గది నిర్మాణం పేరిట అనుమతులు పొంది, సదరు నిర్వాహకులు 4 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కుట్ర పన్నారని, పైగా ఐదేండ్లుగా మున్సిపాలిటీకి తక్కువ మొత్తంలో ఆస్తి పన్నుచెల్లించడంలో అవకతవకలకు పాల్పడుతూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే వార్తలపై అధికారులు స్పందించారు. పన్ను చెల్లింపులు చేసిన తీరులో రసీదులను పరిశీలించి, వాటికి సంబంధించిన అసెస్‌మెంట్ చేస్తామని ఆర్వో తెలిపారు. పత్రికల్లో వచ్చిన కథనాలపై అదే రోజు మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తనిఖీలు చేశారన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది, బిల్ కలెక్టర్ అలీ ఉన్నారు.

మైనర్‌పై లైంగికదాడి.. నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు

జిన్నారం (బొల్లారం) జనవరి 29 : ఓ మైనర్‌కు మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని బొల్లారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి వెల్లడించారు. కామారెడ్డి జిల్లా పెద్ద కొప్‌గల్ గ్రామానికి చెందిన కడారి తరుణ్ (20) బొల్లారం పారిశ్రామికవాడలోని చర్చి బస్తీలో నివసిస్తూ ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఓ మైనర్‌కు మాయ మాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడుతున్నాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో యాక్ట్, ఎస్సీ అండ్ ఎస్టీ పీవోఏ యాక్ట్ కేసులు నమోదు చేసి డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

విద్యాధికారి ఆకస్మిక తనిఖీ

వావిలాల ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యాధికారి వెంకటేశ్వర్లు

జిన్నారం (బొల్లారం) జనవరి 29 : జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలోని కాజిపల్లి, వావిలాల ఉన్నత పాఠశాలతో పాటు, జిన్నారంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. రానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని సూచించారు. కాజీపల్లి లో కేమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని సందర్శించి, గ్రంథాలయ ప్రారంభోత్సవం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వావిలాల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డీఈవోను సన్మానించారు. హెచ్ఎంలు విజయ్ కుమార్, అనిల్ కుమార్, ఎస్ఎవో కవిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

జిన్నారం(బొల్లారం)జనవరి 29 : అభివృద్ధిలో ఆస్తి పన్నులు ఎంతో కీలకమని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, ఆర్వో నర్సింహులు అన్నారు. బుధవారం మున్సిపల్‌లో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని గృహ యజమానులు, పారిశ్రామికవేత్తలు సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు. మార్చి లోపు నిర్దేశిత పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో 2 శాతం వడ్డీతో చెల్లించాల్సి వస్తుందన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా డిమాండ్ రూ. 16 కోట్ల ఆస్తి పన్ను వసూలు ఉండగా, నేటి వరకు రూ.9.88 కోట్ల పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. మరో రూ.6.21 కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. దాదాపు 62 శాతం ఆస్తి పన్ను వసూలైందన్నారు. సకాలంలో పనులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

వివాహానికి ఆర్థిక సాయం

రామచంద్రాపురం, జనవరి29 : పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఏకేఫౌండేషన్ అండగా నిలిచింది. ఆర్సీపురం డివిజన్‌లోని కానుకుంటలో నివాసం ఉండే నిరుపేద మాల దీపక్ కూతురు సోనియా వివాహం సందర్భంగా ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్‌అబ్దుల్ ఖధీర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పేదలకు తమ వంతు సాయం చేస్తామన్నారు.

మండల పంచాయతీ అధికారి బదిలీ

జహీరాబాద్, జనవరి 29: న్యాల్‌కల్ మండల పంచాయతీ అధికారి సురేశ్‌ను బదిలీ చేస్తూ బుధవారం జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఉత్తర్వులను జారీ చేశారు. ఇటీవల ఆయనపై మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన తర్వాత ఆయనను నారాయణఖేడ్ నియోజకవర్గంలోని సిర్గాపూర్ మండల పంచాయతీ అధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీచేశారు.

గద్దర్‌పై వాఖ్యలు అర్థ రహితం

నాగల్‌గిద్ద, జనవరి 29 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గద్దర్‌ను అవమానపరిచేలా అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయన దళిత జాతిని, తెలంగాణ ఉద్యమాన్ని కించపరచడమే అవుతుందని ఆవాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అంబేద్కర్ తాలూకా అధ్యక్షులు గణపతి, బస్వరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సమావేశంలో వారు మాట్లాడారు.

తెల్లాపూర్‌లో బండిసంజయ్ దిష్టిబొమ్మ దహనం

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గద్దర్ గళం సభ్యులు

రామచంద్రాపురం, జనవరి 29 : ప్రజాయుద్ధనౌక గద్దర్ గురించి ఎంపీ బండిసంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహం సమీపంలో గద్దర్ గళం ఎంపీ బండిసంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు భరత్, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బండిసంజయ్‌కి తెలంగాణ చరిత్ర ఏమాత్రం తెలియదని, ఆయన అవగాహన రాహిత్యంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తూర్పుశ్రీను, గుల్లిరవి, వివేక్, గుల్లిశ్రీను, గద్దర్ గళం సభ్యులు ఉన్నారు.

జోగిపేటలో కారు బీభత్సం

అందోల్, జనవరి 29 : జోగిపేటలో బుధవారం కారు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తగా కారు నడపడంతో రోడ్డుపై వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొని కారు పల్టీ కొట్టింది. టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన మారుతి బ్రీజా కారును డ్రైవరు మద్యం మత్తులో అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైత్రీ సేవలు అభినందనీయం

గుమ్మడిదల, జనవరి 29 : మండలంలోని పలు గ్రామాల్లో మైత్రి ఫౌండేషన్ నిర్వహిస్తున్న విద్య, వైద్య సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ ప్రశంసించారు. బుధవారం ట్రస్ట్ చైర్మన్ చెన్నం శెట్టి ఉదయ్ కుమార్ ఆయనను కలిసి ఫౌండేషన్ ద్వారా అందించిన సేవలను వివరించారు. ట్రస్ట్ సభ్యులు నవీన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎగిసి పడుతున్న మిషన్ భగీరథ నీరు

బుధేరా-కంకోల్ శివారులో ఎగిసిపడుతున్న మిషన్ భగీరథ నీళ్లు

మునిపల్లి, జనవరి 29 : మండల పరిధిలోని బుధేరా-కంకోల్ గ్రామాల శివారులోని మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల నిమిత్తం పనులు చేస్తున్న క్రమంలో మిషన్ భగీరథ పైపులోంచి నీళ్లు ఎగిసిపడ్డాయి. బుధేరా నుంచి జహీరాబాద్ సరఫరా అయ్యే మెయిన్‌లైన్ పైపులైన్ వ